సాక్షి
డా. బి ఆర్ అంబేడ్కర్ కోనసీమ
బుధవారం । 3 । జనవరి । 2024



దారి కాచిన మృత్యువు


తూర్పుగోదావరి జిల్లా దేవరపల్లి మండలం బందపురం వద్ద మంగళవారం జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు మృతి చెందారు. - 8లో



నూతన సారథుల నియామకం

ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలోని ఏడు నియోజక వర్గాలకు వైఎస్సార్ సీపీ నూతన సమన్వయ కర్తలను నియమించింది. ఈ వివరాలను పార్టీ మంగళవారం రాత్రి ప్రకటించింది. - 8లో

డెల్టాలకు 12,300 క్యూసెక్కులు



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి డెల్టాలకు మంగళవారం 12,300 క్యూసెక్కుల గోదావరి నీటిని విడుదల చేశారు. తూర్పు డెల్టాకు 3,800, మధ్య డెల్టాకు 2,500, పశ్చిమ డెల్టాకు 6,000 క్యూసెక్కుల చొప్పున వదిలారు. బ్యారేజీ వద్ద నీటిమట్టం 10.75 అడుగులుగా నమోదైంది.

న్యూస్‌రీల్

మాదక ద్రవ్యాలతో అనర్థాలు



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ శుక్లా, చిత్రంలో ఎస్పీ శ్రీధర్

సాక్షి అమలాపురం: మాదక ద్రవ్యాల వినియోగం వల్ల అనేక అనర్థాలు కలుగుతున్నాయని కలెక్టర్ హిమాన్షు శుక్లా అన్నారు. కలెక్టరేట్‌లో మంగళవారం గంజాయి, ఇతర డ్రగ్స్ నియంత్రణపై నియమించిన జిల్లా స్థాయి కమిటీ సమావేశం జరిగింది. దీనికి అధ్యక్షత వహించిన కలెక్టర్ మాట్లాడుతూ కమిటీలో ఉన్న అన్ని విభాగాల వారు నియంత్రణ చర్యలపై నివేదికలను పోలీస్ శాఖకు సమర్పించాలన్నారు. ఎస్పీ ఎస్. శ్రీధర్ మాట్లాడుతూ మాదక ద్రవ్యాల అక్రమ రవాణా, వినియోగాలను అరికట్టేందుకు పటిష్టమైన చర్యలు తీసుకుంటున్నామన్నారు. సమావేశంలో అడ్మిన్ ఎస్పీ ఎస్.ఖాదర్ బాషా, ఆర్డీవోలు జి.కేశవవర్ధన్ రెడ్డి, ఎస్.సుధా సాగర్ పాల్గొన్నారు.

జాతీయ బాస్కెట్ బాల్ పోటీలకు హేమంత్



అమలాపురం రూరల్: ఇందుపల్లి జిల్లా పరిషత్ హైస్కూల్లో 9వ తరగతి చదువుతున్న వి.హేమంత్ జాతీయ స్థాయి బాస్కెట్‌బాల్ అండర్ -14 పోటీలకు రాష్ట్రం తరపున ఎంపికయ్యాడు. చత్తీస్‌గఢ్‌లోని రాజ్‌నందగావ్‌లో ఈనెల 4 నుంచి 7వ తేదీ వరకూ జరిగే పోటీల్లో రాష్ట్రం తరపున ప్రాతినిధ్యం వహిస్తాడు. ఈ విషయాన్ని ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు విత్తనాల శ్రీనివాసరావు మంగళవారం విలేకరులకు తెలిపారు. హేమంత్‌ను స్టాఫ్ సెక్రటరీ జి.పెద్దిరాజు, ఎస్ఎంసీ చైర్మన్ కె.కృష్ణార్జునరావు, సర్పంచ్ శివాలిని అప్పాజీ, ఎంపీటీసీ సభ్యుడు రాంబాబు, పీఈడీ వి.నరసింహారావు, ఉపాధ్యాయులు అభినందించారు.



చెప్పారంటే.. చేస్తారంతే..

మాట తప్పలే.. మడమ తిప్పలే..

- నేడు కాకినాడ రానున్న సీఎం జగన్
- వైఎస్సార్ పెన్షన్ కానుక రూ.3,000కు పెంచే కార్యక్రమానికి శ్రీకారం
- ఆర్ఎంసీ గ్రౌండ్స్‌లో బహిరంగ సభ

సాక్షి ప్రతినిధి, కాకినాడ: లక్షలాది మంది అవ్వాతాతలు కళ్లల్లో ఒత్తులు వేసుకుని కోటి ఆశలతో ఎదురు చూస్తున్న రోజు రానే వచ్చింది. వారి ఆశలను నెరవేర్చేందుకు.. నూతన సంవత్సర కానుక అందించేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి బుధవారం కాకినాడ వస్తున్నారు. పింఛన్‌ను క్రమంగా పెంచుతూ రూ.3,000 చేస్తానని నాడు ప్రతిపక్ష నేతగా ఇచ్చిన మాటను నిలబెట్టుకునే బృహత్తర కార్యక్రమానికి ఆయన ఉమ్మడి 'తూర్పు' గడ్డ నుంచి శ్రీకారం చుట్టనున్నారు. నాటి ఉమ్మడి ఆంధ్ర ప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి ఎన్నో ప్రజోపయోగ కార్యక్రమాలను తూర్పు సెంటిమెంట్‌తో ఈ నేల నుంచే ప్రారంభించారు. ఆయన తనయుడిగా, రాజకీయ వారసుడిగా, ప్రస్తుత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇక్కడి ప్రజల మనస్సును కట్టిపడేసేలా అదే సెంటిమెంట్ కొనసాగిస్తూ వస్తున్నారు. గతంలో అనేక సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలకు ఆయన ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచే శ్రీకారం చుట్టారు. ఇప్పుడు అదే ఒరవడితో అవ్వాతాతలు, ఇతర వర్గాలకు ఇస్తున్న పింఛన్‌ను రూ.2,750 నుంచి రూ.3,000కు పెంచే బృహత్తర కార్యక్రమాన్ని కాకినాడలో ప్రారంభించనున్నారు. సీఎం జగన్ పర్యటనకు కాకినాడ రంగరాయ వైద్య కళాశాల (ఆర్ఎంసీ) స్పోర్ట్స్ గ్రౌండ్స్‌లో ఏర్పాట్లు పూర్తయ్యాయి.



కాకినాడ ఆర్ఎంసీ మైదానంలో ముస్తాబవుతున్న సభా ప్రాంగణం

ఈ నేలపై నుంచే సంక్షేమ జల్లులు

- గడచిన నాలుగున్నరేళ్లుగా అనేక సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా నుంచే ప్రారంభించడం విశేషం.
- ఆయన మానస పుత్రికగా భావించే గ్రామ/వార్డు సచివాలయ వ్యవస్థకు ఇక్కడే అంకురార్పణ జరిగింది. ఉమ్మడి జిల్లా కేంద్రంగా కాకినాడ ఉన్న సమయంలోనే మండల కేంద్రమైన కరపలో గ్రామ/వార్డు సచివాలయ వ్యవస్థను ముఖ్యమంత్రి జగన్ ప్రారంభించారు. ప్రభుత్వ పరిపాలనను ప్రజలకు చేరువ చేసిన ఈ మహత్తర కార్యక్రమానికి 2019 అక్టోబర్ 2న గాంధీ జయంతి నాడు శ్రీకారం చుట్టారు. తద్వారా ఆ మహాత్ముడు కలలుగన్న గ్రామ స్వరాజ్యాన్ని సాకారం చేశారు.
- 2019 నవంబర్ 21న వైఎస్సార్ మత్స్యకార భరోసా కార్యక్రమం ద్వారా మత్స్యకారులకు ఆర్థిక సహాయం అందజేసే కార్యక్రమాన్ని ముమ్మిడివరం నియోజకవర్గంలో ప్రారంభించారు.
- విద్యా వ్యవస్థలో విప్లవాత్మక మార్పులకు నాంది పలికిన 'మన బడి నాడు–నేడు'ను కూడా ఆయన ఇక్కడి నుంచే చేపట్టారు. నాడు–నేడు మొదటి దశ కింద 2020–21లో రూ.3,669 కోట్లతో రాష్ట్రవ్యాప్తంగా 15,715 పాఠశాలల్లో పనులు ఆరంభించారు. వీటిని పూర్తి చేసి, 2021 ఆగస్టు 16న కోనసీమలోని పి.గన్నవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నుంచి ప్రజలకు అంకితం చేశారు. 2021–22లో రూ.4,563 కోట్లతో రెండో విడత కింద చేపట్టిన 12,663 పాఠశాలల అభివృద్ధికి కూడా అక్కడి నుంచే శంకుస్థాపన చేశారు. ఆ పనులు ఇప్పుడు వేర్వేరు దశల్లో ఉన్నాయి.
- 2021 డిసెంబర్ 30న రాష్ట్రవ్యాప్తంగా 30 లక్షల ఇళ్లు నిర్మించే ప్రాజెక్టుకు పిఠాపురం నియోజకవర్గం కొత్తపల్లి మండలం కొమరగిరిలో శ్రీకారం చుట్టారు. తద్వారా పేదలందరికీ సొంతిల్లు సమకూర్చే గొప్ప కార్యక్రమాన్ని ప్రారంభించారు.
- 2022 అక్టోబర్ 26న పిఠాపురం నియోజకవర్గం గొల్లప్రోలులోను, గత ఏడాది సెప్టెంబర్ 16న నిడదవోలు పట్టణంలోను వైఎస్సార్ కాపు నేస్తం నిధులు విడుదల చేశారు.
- విద్యార్థులకు బంగారు భవితను అందిస్తున్న జగనన్న విద్యా దీవెన ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను కొవ్వూరులో గత ఏడాది మే 12న ముఖ్యమంత్రి జగన్ ప్రారంభించారు.
- గత ఏడాది ఆగస్టు 11న మూడో విడత వైఎస్సార్ సున్నా వడ్డీ నిధులను అమలాపురం నుంచి సీఎం జగన్ విడుదల చేశారు.
- గత సెప్టెంబర్ 12న సామర్లకోట మున్సిపాలిటీలోని పేదలందరి సొంతింటి కలను సాకారం చేశారు. సామర్లకోట జగనన్న కాలనీలో 1,000, రాష్ట్ర వ్యాప్తంగా 7 లక్షల ఇళ్లను సీఎం జగన్ ప్రారంభించారు.
- ఇలా ప్రతిష్టాత్మక సంక్షేమ కార్యక్రమాలకు ఇక్కడి నుంచే శ్రీకారం చుట్టిన ఆయన.. నేడు పింఛన్ పెంపునకు కూడా కాకినాడ నుంచే శ్రీకారం చుడుతూండటం విశేషం.

రూ.94 కోట్ల అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవం

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బుధవారం పింఛన్ పెంపుతో పాటు కాకినాడలో సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి ఆధ్వర్యాన పూర్తి చేసిన మూడు ప్రధాన అభివృద్ధి పనులను కూడా ప్రారంభించనున్నారు. నగర వాసుల ట్రాఫిక్ కష్టాలను తీర్చేందుకు రూ.65 కోట్లతో పూర్తి చేసిన ముత్తా గోపాలకృష్ణ వారధి (కొండయ్యపాలెం ఫ్లై ఓవర్)ను ప్రారంభిస్తారు. అలాగే, క్రీడాభిమానుల చిరకాల స్వప్నంగా రూ.9 కోట్లతో నిర్మించిన స్కేటింగ్ రింక్‌ను ప్రారంభించనున్నారు. దివంగత నేత రాగిరెడ్డి వెంకట జయరామ్ కుమార్ (ఫ్రూటీ కుమార్) నగరానికి చేసిన సేవలకు గుర్తింపుగా రాజా ట్యాంక్ ఆవరణలో రూ.20 కోట్లతో నిర్మించిన రాగిరెడ్డి కళాక్షేత్రాన్ని కూడా సీఎం జగన్ ప్రారంభిస్తారు. ఒకేసారి 770 మంది వీక్షించేందుకు వీలుగా ఈ కళాక్షేత్రాన్ని తీర్చిదిద్దారు.



సభా ప్రాంగణంలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న సీఎం ప్రోగ్రాం కో ఆర్డినేటర్ తలశిల రఘురాం, కాకినాడ ఎంపీ వంగా గీత, ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి తదితరులు

సీఎం పర్యటన సాగుతుందిలా..

- ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఉదయం 9.40 గంటలకు తాడేపల్లి నుంచి హెలికాప్టర్‌లో బయలుదేరి 10.20 గంటలకు కాకినాడ పోలీస్ పరేడ్ గ్రౌండ్స్‌కు చేరుకుంటారు.
- 10.30 గంటల వరకూ ప్రజాప్రతినిధులను కలుస్తారు.
- అనంతరం హెలిప్యాడ్ నుంచి బయలుదేరి 10.40 గంటలకు బహిరంగ సభ జరిగే రంగరాయ వైద్య కళాశాల (ఆర్ఎంసీ) గ్రౌండ్స్‌కు చేరుకుంటారు.
- అక్కడి నుంచే అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభిస్తారు.
- 10.40 నుంచి 11.55 గంటల వరకూ వైఎస్సార్ పింఛన్ కానుక పెంపుదల కార్యక్రమంలో పాల్గొంటారు.
- 11.55 గంటలకు సభా వేదిక నుంచి హెలిప్యాడ్‌కు బయలుదేరి వెళ్తారు.
- మధ్యాహ్నం 12 నుంచి ఒంటి గంట వరకూ స్థానిక నాయకులను కలుసుకుంటారు.
- 1.05 గంటలకు హెలికాప్టర్‌లో బయలుదేరి 1.55 గంటలకు తాడేపల్లిలోని తన నివాసానికి చేరుకుంటారు.

గాలికుంటు టీకా.. పశువులకు రక్ష

- వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమం ప్రారంభం
- ఈ నెల 31వ వరకూ నిర్వహణ
- జిల్లాలో 2.29 లక్షల పశువులు

రాయవరం: మూగజీవాలపై పలు రకాల వ్యాధులు దాడి చేస్తుంటాయి. ముఖ్యంగా పశువులకు వైరస్ ద్వారా వ్యాపించే గాలికుంటు వ్యాధి కారణంగా ఉత్పాదక శక్తి తగ్గుతుంది. ఫలితంగా రైతులు ఆర్థికంగా నష్టపోతున్నారు. ఇంగ్లిషులో ఫుట్ అండ్ మౌత్ డిసీజ్‌గా పేర్కొనే గాలికుంటు వ్యాధి బారిన పడిన పశువులను సరైన చికిత్సా విధానాలు పాటించి కాపాడుకునే అవకాశముంది. ఈ నేపథ్యంలో మంగళవారం నుంచి జిల్లాలో 32వ విడత గాలికుంటు వ్యాధి నివారణకు సామూహిక టీకాల కార్యక్రమం చేపట్టారు. ఈ నెలాఖరు వరకూ జరుగుతుంది.

వ్యాధి లక్షణాలు

- గాలిలో తేమశాతం అధికంగా ఉన్నప్పుడు గాలికుంటు వ్యాధి వ్యాపించే అవకాశం ఎక్కువ. ఈ వ్యాధి సోకిన సమయంలో పశువుల్లో గర్భం విఫలమవుతుంది. వేడిని తట్టుకోలేవు. గేదె, మేక, గొర్రె వంటి జీవాల్లో తీవ్రమైన జ్వరం కనిపిస్తుంది.
- పాల దిగుబడి తగ్గడం, నోరు, మూతి, కాళ్లు, పొదుగు మీద పుండ్లు, బొబ్బలు కనపడటం, కుంటడం, నోటి నుంచి విపరీతంగా నురగ కారడం వంటి లక్షణాలు ఉంటే గాలికుంటు వ్యాధి సోకినట్టు గుర్తించాలి. ఆగస్టు, సెప్టెంబర్, మార్చి, ఏప్రిల్ మాసాల్లో ఈ వ్యాధి ఎక్కువగా వస్తుంది.
- దీని కారణంగా మరణాల శాతం తక్కువైనప్పటికీ పశువుల్లో ఉత్పాదక శక్తి సామర్థ్యం తగ్గుతుంది. జ్వర తీవ్రత 104–106 డిగ్రీల ఫారన్ హీట్ వరకూ పెరిగిన పశువులు నీరసిస్తాయి.
- నోటి ఎపిథీలియం (పైపొర), పళ్లు, చిగుళ్లు, నాలుక, ముట్టె లోపలి ప్రాంతాల్లో బొబ్బలు ఏర్పడి, అవి 24 గంటల్లో చితికి పోవడం వల్ల పశువులు నొప్పితో మేత తినవు. నోటి నుంచి చొంగ కారుతుంది.
- చూడి పశువుల్లో గర్భస్రావాలు సంభవిస్తాయి.



పశువులు



కాలి గిట్టలో ఏర్పడిన పుండు



పశువు నోటిలో పుండు

పొదుగుపై బొబ్బలు ఏర్పడి ఒక్కొక్కసారి పొదుగు వాపు సంభవిస్తుంది. పశువులు శ్వాసను కష్టంగా పీల్చుతూ, రొప్పుతూ ఎండ వేడిమికి తట్టుకోలేక నీరసిస్తాయి.

వ్యాధి వ్యాప్తి చెందే విధానం

పశువుల అంతస్రావాల (లాలాజలం, పుండ్ల నుంచి కారే రసి) వల్ల వ్యాధి మిగతా పశువులకు వ్యాప్తి చెందే అవకాశం ఉంది. వ్యాధి కారక క్రిమి ఒక ప్రదేశం నుంచి మరో ప్రదేశానికి గాలి ద్వారా వ్యాప్తి చెందుతుంది. గాలిలో తేమశాతం అధికంగా ఉన్నప్పుడు ఉన్నప్పుడు ఒక చోట నుంచి మరోచోటుకు త్వరగా వ్యాప్తి చెందుతుంది. సంకర జాతి పశువులు త్వరగా ఈ వ్యాధి బారిన పడతాయి.

నివారణా చర్యలు

- పశువులు బాగా బలహీనంగా ఉంటే గ్లూకోజ్ రక్తంలోకి ఇవ్వాల్సి ఉంటుంది. నోటిలో పుండ్ల వల్ల మేత మేయవు. కనుక వాటికి సులభంగా జీర్ణమయ్యే పోషక పదార్థాలతో కూడిన ఆహారం అందించాలి.
- జావ, జొన్న, అన్నం, ఉప్పు, బెల్లంతో కలిపి ప్రతిరోజూ తాగించడం ద్వారా బలహీన పడకుండా జాగ్రత్త వహించాలి. ఈ వ్యాధి సోకిన పశువులను వేరు చేయాలి. వీటి మల మూత్రాలను గడ్డిలో కాల్చివేయాలి
- చనిపోయిన పశువులను సున్నపు గోతిలో పూడ్చాలి. ఆబోతులు, దున్నల వీర్యం ద్వారా కూడా వ్యాధి వ్యాపిస్తుంది. అందువల్ల వ్యాధి సోకిన వాటిని సుమారు 3 నెలల వరకు సంపర్కానికి వినియోగించకూడదు.
- కాలి గిట్టల మధ్య పుండ్లను పొటాషియం పర్మాంగనేట్ ద్రావకాలతో కడిగి సీమ్‌లెంట్, వేపనూనె పూయాలి. నోటిలోని పుండ్లకు బోరిక్ పౌడర్ చల్లి గ్లిజరిన్ కలిపి పూయాలి. వైద్యుడిని సంప్రదించి అవసరమైన మందులు వాడాలి.

ఏరియా ఆస్పత్రి	మండలం	డోస్‌లు
కొత్తపేట		
	కొత్తపేట	6,400
	అయినవిల్లి	10,250
అమలాపురం		
	అల్లవరం	9,800
	అమలాపురం	8,950
	అమలాపురం అర్బన్	1,550
పి.గన్నవరం		
	అంబాజీపేట	8,650
	పి.గన్నవరం	7,100
రావులపాలెం		
	ఆత్రేయపురం	8,350
	పి.గన్నవరం	7,300
ముమ్మిడివరం		
	ముమ్మిడివరం	8,200
	ముమ్మిడివరం అర్బన్	1,550
	ఐ.పోలవరం	7,750
ఉప్పలగుప్తం		
	ఉప్పలగుప్తం	8,000
	కాట్రేనికోన	9,000
మలికిపురం		
	సఖినేటిపల్లి	11,000
	మలికిపురం	7,000
రాజోలు		
	రాజోలు	6,800
	మామిడికుదురు	8,000
రామచంద్రపురం		
	రామచంద్రపురం	10,150
	ఆర్‌సీపీఎం అర్బన్	1,750
	కె.గంగవరం	14,450
ఆలమూరు		
	ఆలమూరు	9,100
	కపిలేశ్వపురం	11,100
రాయవరం		
	మండపేట	10,300
	మండపేట అర్బన్	3,900
	రాయవరం	5,200

జిల్లాలో పశుసంపద

డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో 2.29 లక్షల పశువులున్నాయి. వీటిలో 75,640 ఆవులు, 1,53,542 గేదెలు ఉన్నాయి. మూడు నెలల పైబడి ఉన్న 2.01 లక్షల పశువులకు గాలికుంటు వ్యాధి నివారణకు టీకాలు తప్పనిసరిగా వేయించాలి. ప్రస్తుతం జిల్లాలో పశువైద్యశాఖ ద్వారా ఉచితంగా ఈ కార్యక్రమం జరుగుతోంది. జిల్లా వ్యాప్తంగా సకాలంలో వ్యాధి నిరోధక టీకాలు వేసేందుకు 64 బృందాలను ఏర్పాటు చేశారు. వీరు 128 పశువైద్య శిబిరాల ద్వారా జిల్లాలోని పశువులకు వ్యాధి నిరోధక టీకాలు వేయడం లక్ష్యంగా నిర్ణయించుకున్నారు.

టీకాల కార్యక్రమం ప్రారంభం



గాలికుంటు వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమాన్ని జిల్లాలో ప్రారంభించాం. ప్రతి పాడి రైతు మూడు నెలల వయసు పైబడిన ఆవులు, గేదెలకు ప్రభుత్వం ఉచితంగా అందిస్తున్న ఈ టీకాలను వేయించాలి. తద్వారా భవిష్యత్తులో శాశ్వతంగా వ్యాధిని అదుపు చేసే అవకాశముంది. పాడి రైతులు ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలి.

- డాక్టర్ కర్నీడి మూర్తి, అమలాపురం



నేటి నుంచి నర్సింగ్ పరీక్షలు

- కాకినాడ ఆర్ఎంసీలో పూర్తయిన ఏర్పాట్లు
- హాజరుకానున్న ఉమ్మడి జిల్లాలోని 2,500 మంది విద్యార్థులు
- తొలిసారిగా రాజమహేంద్రవరం, అమలాపురంలో నిర్వహణ

కాకినాడ క్రైం: జీఎన్ఎం విద్యార్థుల వార్షిక పరీక్షలు బుధవారం నుంచి ప్రారంభం కానున్నాయి. జిల్లా వ్యాప్తంగా ఉన్న 53 నర్సింగ్ స్కూళ్ల విద్యార్థులు ఈ పరీక్షలకు హాజరుకానున్నారు. ఆది నుంచీ జీఎన్ఎం పరీక్షల నిర్వహణ కేవలం కాకినాడ రంగరాయ వైద్య కళాశాలలోనే సాగేది. ఈ ఏడాది తొలిసారిగా రాజమహేంద్రవరం ప్రభుత్వ వైద్య కళాశాల, అమలాపురం కిమ్స్‌లో కూడా నిర్వహించనున్నారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని 53 నర్సింగ్ స్కూళ్లకు గాను 32 నర్సింగ్ స్కూళ్లకు చెందిన 1,700 మంది విద్యార్థులు కాకినాడ రంగరాయ వైద్య కళాశాలలోనూ, 10 స్కూళ్లకు చెందిన 350 మంది రాజమహేంద్రవరం ప్రభుత్వ వైద్య కళాశాలలోనూ, 11 నర్సింగ్ స్కూళ్లకు చెందిన 450 మంది అమలాపురం కిమ్స్‌లో పరీక్షలు రాయనున్నారు. తొలి రోజు ఉదయం 9 నుంచి 12 గంటల వరకూ ప్రథమ సంవత్సరం, మధ్యాహ్నం 2 నుంచి 5 గంటల వరకూ తృతీయ ఏడాది విద్యార్థులు పరీక్షలు రాస్తారు. సెకండియర్ పరీక్షలు గురువారం నుంచి మొదలు కానున్నాయి. కాకినాడ రంగరాయ వైద్య కళాశాలలో పరీక్షలకు గాను 25 మంది సీనియర్, జూనియర్ క్లరికల్ సిబ్బందిని ఇన్విజిలేటర్లుగా, ఆరుగురు అటెండర్లను సహాయకులుగా నియమించారు. పరీక్షల నిర్వహణ జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ లావణ్యకుమారి ఆధ్వర్యంలో జరగనుంది. సీఎస్ఆర్ఎంవో డాక్టర్ పుష్కరరావు, ఆర్ఎంవో డాక్టర్ రాహుల్ పర్యవేక్షకులుగా వ్యవహరిస్తుండగా, ఆర్ఎంసీ స్కూల్ ఆఫ్ నర్సింగ్ ప్రిన్సిపల్ ఆశాదేవి చీఫ్ ఎగ్జామినర్ బాధ్యతలు నిర్వర్తిస్తారు. బుధవారం నుంచి ఈనెల 11 వరకూ పరీక్షలు కొనసాగుతాయి.

నూతన సారథుల నియామకం

- ఏడు నియోజకవర్గాలకు కొత్త కో ఆర్డినేటర్లు
- ఏడింటిలో బీసీలకు 3.. కాపు సామాజికవర్గానికి 3.. ఎస్సీలకు 1

సాక్షి ప్రతినిధి, కాకినాడ: ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలోని పలు నియోజకవర్గాలకు వైఎస్సార్ సీపీ నూతన సమన్వయకర్తలను నియమించింది. ఇందులో బీసీ వర్గాలకు సముచిత స్థానం కల్పించింది. రాష్ట్రవ్యాప్తంగా మంగళవారం రాత్రి ప్రకటించిన జాబితాలో ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా నుంచి ఏడుగురు సమన్వయకర్తలను వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధ్యక్షులు, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు పార్టీ కేంద్ర కార్యాలయం నియమించింది. ప్రకటించిన ఏడుగురు సమన్వయకర్తల్లో ముగ్గురు బీసీలు, ఒకరు ఎస్సీ, మరో ముగ్గురు కాపు సామాజిక వర్గ నేతలు ఉండటం విశేషం.

ఉమ్మడి జిల్లాలో బీసీల నుంచి బలమైన శెట్టిబలిజ సామాజికవర్గం నుంచి ఇద్దరికి, గౌడ సామాజికవర్గం నుంచి ఒకరిని సమన్వయకర్తలుగా నియమించారు. గతంలో ఉమ్మడి జిల్లా నుంచి ఒకే ఒక్క నియోజకవర్గాన్ని శెట్టిబలిజలకు కేటాయిస్తూ వస్తున్నారు. అందుకు పూర్తి భిన్నంగా తొలిసారిగా శెట్టిబలిజలకు రెండు, గౌడ సామాజికవర్గానికి ఒకటి కలిపి మొత్తం మూడు నియోజకవర్గాలకు బీసీలను సమన్వయకర్తలుగా నియమించడం విశేషమని నేతలు విశ్లేషిస్తున్నారు.

- వాగ్ధాటి, అందరితో సమన్వయం చేసుకోగలిగే రాజకీయ చతురత కలిగిన మంత్రిగా పేరొందిన చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణకు రాజమహేంద్రవరం రూరల్ కేటాయించారు. జెడ్పీటీసీ సభ్యుడిగా, ఉమ్మడి జిల్లా పరిషత్ చైర్మన్‌గా, మంత్రిగా విశేష రాజకీయ అనుభవం కలిగిన వేణును రాజమహేంద్రవరం రూరల్‌కు కేటాయించడం విశేషంగా చెప్పుకుంటున్నారు.
- రాజమహేంద్రవరం యువ ఎంపీ మార్గాని భరత్‌రామ్‌ను రాజమహేంద్రవరం సిటీకి సమన్వయకర్తగా నియమించారు. రాజకీయ అరంగేట్రంతోనే నిత్యం ప్రజల్లో ఉంటున్న భరత్‌ను ఎంపిక చేశారంటున్నారు. రాజమహేంద్రవరం ఎంపీ స్థానాన్ని తొలిసారి బీసీలకు కేటాయించిన వైఎస్సార్ సీపీ ఇప్పుడు.. రాజకీయ చరిత్రలో మరే పార్టీ చేయని విధంగా ఉమ్మడి 'తూర్పు'లో తొలిసారిగా గౌడ సామాజికవర్గానికి చెందిన భరత్‌ను సిటీ అసెంబ్లీ స్థానానికి సమన్వయకర్తగా నియమించింది.
- డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రామచంద్రపురం నియోజకవర్గ సమన్వయకర్తగా శెట్టిబలిజ సామాజికవర్గానికి చెందిన రాజ్యసభ సభ్యుడు పిల్లి సుభాష్‌చంద్రబోస్ కుమారుడు సూర్యప్రకాష్‌ను నియమించారు. ఉమ్మడి జిల్లాలో శెట్టిబలిజ సామాజిక వర్గం నుంచి రాజ్యసభకు ప్రాతినిధ్యం కల్పించిన తొలి పార్టీ వైఎస్సార్ సీపీనే కావడం గమనార్హం. ఇప్పుడు అదే సామాజికవర్గం నుంచి యువకుడు, విద్యావంతుడైన సూర్యప్రకాష్‌ను సమన్వయకర్తగా నియమించారు. ఇలా ఉమ్మడి జిల్లాలో మూడు నియోజవకర్గాలకు బీసీలను సమన్వయకర్తలుగా నియమించారు. ఇదివరకు ఏ రాజకీయ పార్టీ ఉమ్మడి జిల్లాలో బీసీలకు ఇంతటి ప్రాధాన్యం కల్పించ లేదని విశ్లేషకులు అంటున్నారు.
- కోనసీమలో ఎస్సీలకు రిజర్వు చేసిన పి.గన్నవరం నియోజకవర్గానికి విప్పర్తి వేణుగోపాలరావును సమన్వయకర్తగా నియమించారు. నీటిపారుదల శాఖలో ఎస్ఈగా రిటైరైన ఆయన విద్యావంతుడు. సౌమ్యుడిగా పేరుంది. దీంతో ఆయనను నాడు జెడ్పీ చైర్మన్‌గా ఎన్నుకున్నారు. ఆ ప్రాతిపదికనే ఇప్పుడు పి.గన్నవరం సమన్వయకర్తగా వేణుగోపాలరావును పార్టీ అధిష్టానం నియమించింది.
- కాకినాడ జిల్లా మెట్ట ప్రాంతంలో మూడు నియోజకవర్గాలకు సమన్వయకర్తలను నియమించారు. గతంలో ఎమ్మెల్యే, స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ మంత్రిగా, కాకినాడ ఎంపీగా పని చేసిన తోట నరసింహాన్ని జగ్గంపేట నియోజకవర్గ సమన్వకర్తగా నియమించారు. నాడు వైఎస్ కేబినెట్‌లో కూడా నరసింహం మంత్రిగా పని చేశారు.
- పిఠాపురం నియోజకవర్గానికి కాకినాడ ఎంపీ వంగా గీతను సమన్వయకర్తగా నియమించారు. జెడ్పీ చైర్‌పర్సన్, రాజ్యసభ సభ్యురాలు, ఎమ్మెల్యేగా పని చేసి ప్రస్తుతం ఎంపీగా ఉన్న గీతకు దాదాపు మూడు దశాబ్దాల రాజకీయ అనుభవం ఉంది. అందరితో కలుపుగోలుగా ఉంటారు.
- ప్రత్తిపాడు నియోజకవర్గ సమన్వయకర్తగా మాజీ ఎమ్మెల్యే వరుపుల సుబ్బారావును నియమించారు. ఆయన గతంలో ఉమ్మడి జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ చైర్మన్, ప్రత్తిపాడు ఎమ్మెల్యేగా పని చేశారు.


మార్గాని భరత్‌రామ్, రాజమహేంద్రవరం సిటీ; చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ, రాజమహేంద్రవరం రూరల్; విప్పర్తి వేణుగోపాల్, పి.గన్నవరం; పిల్లి సూర్యప్రకాష్, రామచంద్రపురం; వంగా గీత, పిఠాపురం; తోట నరసింహం, జగ్గంపేట; వరుపుల సుబ్బారావు, ప్రత్తిపాడు

![APSCSCL]

ANDHRA PRADESH STATE CIVIL SUPPLIES CORPORATION LIMITED
District Office, AIMS College Compound, Mummidivaram 533216
Dr. B.R.Ambedkar Konaseema District :: Mail id: dcsmksm@gmail.com

No.P.Admn.A1/Recruitment 2023/Technical Assistants (contract) Date: 02-01-2024

EMPLOYMENT NOTIFICATION

Applications are invited from the interested and eligible local candidates (Newly formed Dr. B. R. Ambedkar Konaseema district jurisdiction) for recruitment of (5) Technical Assistants on contract basis duly following roster for a period of (1) year in APSCSCL, Dr. B. R.Ambedkar Konaseema through District Selection Committee headed by the Joint Collector & EOED. The vacancies are as detailed here under:

The requisite qualification and the monthly remuneration details are as follows:

S N	Category of Post	No.of Posts	Eligible Category	Desired Qualification	Monthly Remuneration
1	Technical Assistants (Contract basis for a period of one Year)	5	As per roster	i) B.Sc (Agri.)/ B.Sc (Hort)/ B.Sc (Dry Land Agri.) ii) Graduates in Bio-technology/ Science Graduates with specialization in Botany iii)Diploma in Agri Polytechnic/ Organic Farming/ Land Protection.	Rs.22000/- per month+1 1250/- (TA)

Maximum Age Limit: 35 years for General category and 40 years for BC/SC/ST.

The interested candidates can apply by sending their applications to the address mentioned below link Registered post/Courier and the last date for receipt of applications is **10.01.2024 (Wednesday) upto 5 PM**. The application form, details of selection criteria for selection of candidates and timelines are available on the **https://konaseema.ap.gov.in/**

Joint Collector & EOED
APSCSCL :: Dr. B.R.Ambedkar Konaseema

దారి కాచిన మృత్యువు

- కారును ఢీకొన్న మరో కారు
- ఒకే కుటుంబంలో ముగ్గురి మృతి
- ఎనిమిది మందికి తీవ్ర గాయాలు

దేవరపల్లి: గుండుగొలను – కొవ్వూరు జాతీయ రహదారి (316డి)పై దేవరపల్లి మండలం బందపురం వద్ద మంగళవారం మధ్యాహ్నం ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ఒక కారు అదుపు తప్పి ఎదురుగా వస్తున్న మరో కారును ఢీకొన్న ఘటనలో ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు మృతి చెందారు. వివరాలు ఇలా.. కృష్ణాజిల్లా నందిగామ జానకి రామయ్య కాలనీకి చెందిన వేల్పూరు విజయ మోహన్, సజని గ్రేస్, కుమార్తె అమితాశ్రీ, కుమారుడు రోవిన్ జేదిద్యతో కలిసి కారులో మంగళవారం ఉదయం ఇంటి వద్ద నుంచి విశాఖపట్నం బయలు దేరారు. వీరి కారు దేవరపల్లి మండలం బందపురం వద్ద హైవేపై అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొంది. ముందు టైర్ పంక్చర్ కావడంతో డివైడర్‌ను దాటి కుడి వైపు రోడ్డులో సుమారు 200 మీటర్లు దూసుకుపోయింది. ఆ సమయంలో విశాఖపట్నం నుంచి హైదరాబాద్ వెళుతున్న మరో కారును ఢీకొంది. ఈ ప్రమాదంలో హైదరాబాద్ వెళుతున్న కారులోని ఇండిగ శుభాష్ గౌడ్, భార్య దివ్య ప్రియ (25), తల్లి రమాదేవి, కుమార్తె గనిష్క (18 నెలలు), బంధువు ఈడిగ మల్లికార్జున్, స్వప్న, మేనల్లుడు వికాష్ సాయి తీవ్రంగా గాయపడ్డారు. అలాగే విశాఖపట్నం వెళుతున్న కారులోని వేల్పూరు విజయ మోహన్, సజని గ్రేస్, అమితాశ్రీ, రోవిన్ జేదిద్యకు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులందరినీ దేవరపల్లి, కొవ్వూరులో ఆసుపత్రులకు 108, హైవే అంబులెన్స్‌లలో తరలించారు.


ప్రమాద స్థలంలో తీవ్ర గాయాలతో ఇండిగ రమాదేవి, దివ్యప్రియ (వీరిద్దరూ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందారు)


ప్రమాదంలో నుజ్జునుజ్జయిన కార్లు. ఘటనా స్థలం వద్ద ఎమ్మెల్యే తలారి వెంకట్రావు

తక్షణమే స్పందించిన ఎమ్మెల్యే వెంకట్రావు

దేవరపల్లి మండలం గౌరీపట్నంలో జగనన్న సురక్ష రెండో విడత కార్యక్రమానికి హాజరై అటువైపు వస్తున్న గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావు ప్రమాదాన్ని చూసి చలించిపోయారు. ప్రమాద స్థలం వద్ద ఆగి సహాయక చర్యలు చేపట్టారు. 108, హైవే అంబులెన్స్‌లకు సమాచారం అందించారు. హైవేపై వెళుతున్న ప్రయాణికులు, చుట్టుపక్కల పొలాల్లో పని చేస్తున్న కూలీల సహకారంతో క్షతగాత్రులను కొవ్వూరు ప్రభుత్వ ఆసుపత్రికి, గౌరీపట్నంలోని ప్రాథమిక ఆరోగ్యకేంద్రానికి పంపించారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం చేయాలని ఆసుపత్రుల వైద్యాధికారులకు సూచించారు. ట్రైనీ డీఎస్పీ భానోదయ, దేవరపల్లి సీఐ అనసూరి శ్రీనివాసరావు, సిబ్బంది హుటాహుటీన ప్రమాద స్థలానికి చేరుకుని పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ శ్రీనివాసరావు తెలిపారు.

చికిత్స పొందుతూ ముగ్గురి మృతి

దేవరపల్లిలోని ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న చిన్నారి గనిష్క మృతి చెందగా, రాజమహేంద్రవరంలో చికిత్స పొందుతూ దివ్య ప్రియ, రమాదేవి మృతి చెందారు.

బాలిక మృతదేహాన్ని పోలీసులు కొవ్వూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. శుభాష్ గౌడ్, విజయ మోహన్, సజని గ్రేస్ దేవరపల్లిలోని ప్రైవేటు ఆసుపత్రిలో, అమితాశ్రీ, రోవిన్ జేదిద్య రాజమహేంద్రవరంలోని సాయి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు.

న్యూ ఇయర్ వేడుకలకు వచ్చి...

శుభాష్ గౌడ్ హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్నాడు. అతడి భార్య దివ్య ప్రియ పుట్టిల్లు విశాఖపట్నం. నూతన సంవత్సర వేడుకల కోసం కుటుంబ సభ్యులతో కలిసి అత్తవారి ఇంటికి వెళ్లాడు. వేడుకలను జరుపుకొని తిరిగి వస్తుండగా కారు రూపంలో మృత్యువు వెంటాడింది. అయితే కుమార్తె, భార్య, తల్లి మృతి చెందిన విషయాన్ని సాయంత్రం వరకు శుభాష్ గౌడ్‌కు తెలియకుండా గోప్యంగా ఉంచారు. వారి కుటుంబ సభ్యులకు పోలీసులు సమాచారం అందించారు.

బహిరంగ ప్రకటన

మా క్లయింట్లు అయిన కాకినాడ జిల్లా, కాకినాడ వాస్తవ్యులు 1. ఆమలకంటి సాయి సత్య స్వరూప్, 2. బీర్ల ధనకోటి వెంకట రెడ్డి, 3. బీర బృందావళి, 4. కాలాడి కామేశ్వర రావు, 5. ఏనుముల నాగేంద్ర ప్రసాద్ అను వార్లు మాకు ఇచ్చిన సంజాయిషీ పై ఇందుమూలముగా యావన్మందికి తెలియజేయునది ఏమనగా, ఈ నోటీసు నందు ఉదహరించిన ఆస్థి మా క్లయింట్లకు చెందిన ఆస్థి అయి యున్నది. మరియు ఈ ఆస్థులకు సంబంధించి కాకినాడ కోర్టు లో దావాలు జరుగుచున్నవి. ఇట్లు ఉండగా నోటీసు షెడ్యూలు ఆస్తికి సంబంధించి ఏ మాత్రం సంబంధం లేని కొంతమంది వ్యక్తులు ఈ ఆస్థి వారిదిగా చెబుతూ అన్యాక్రాంతములు చేయుటకు ప్రయత్నం చేయుచున్నట్లు మా క్లయింట్లకు తెలియవచ్చినది.

కావున ఇందుమూలముగా యావన్మందికి తెలియజేయునది ఏమనగా ఇందు ఉదహరించిన షెడ్యూలు దాఖలా ఆస్తికి సంబంధించి మా క్లయింట్లకు తప్ప ఇతరులకు ఎవరికి కూడా సదరు ఆస్తిని అన్యాక్రాంతము చేయుట కాని మా క్లయింట్ లను బైండ్ చేయుటకు కాని మరియు వారికి ఏ విధమైన హక్కులు సంక్రమించవని ఇందుమూల ముగా వారికి తెలియజేయుడమైనది.

షెడ్యూలు

పూర్వం తూర్పుగోదావరి జిల్లా, ప్రస్తుతం కాకినాడ జిల్లా, కాకినాడ అర్బన్ మండలం, కాకినాడ జిల్లా రిజిస్ట్రారులో చేరిన, పూర్వం కాకినాడ మున్సిపల్ ఏరియాలో చేరిన, ప్రస్తుతం కాకినాడ మున్సిపల్ కార్పొరేషన్ ఏరియాలో చేరిన, కాకినాడ పట్టణం, సూర్యారావు పేట గ్రామం తాలూకు, కొండయ్యపాలెం, వార్డు నెం.1రు, బ్లాకు నెం. 1రు సర్వే నెం. 195/8 రు దాఖలా ఏకపత్రిగా గల చ.గ. 1666లు స్థలమునకు హద్దులు వివరం.

తూర్పు : ఆ 20 లు వెడల్పు గల రోడ్డు
పడమర : ఆ 80 లు వెడల్పు గల రోడు
ఉత్తరం : బాదం సుబ్రహ్మణ్యం గారి స్థలం
దక్షిణం : గుండా తాతబ్బాయి మరియు వారి కుటుంబ సభ్యులు అమ్మిన స్థలం

రాచకొండ వేంకటేశ్వరులు, రాచకొండ వెంకట సుబ్రహ్మణ్యం
రాచకొండ సత్య శ్రీనివాస్ – న్యాయవాదులు
గంజాం వారి వీధి, కాకినాడ.

అశ్రునయనాలతో ఆఖరి వీడ్కోలు



ఎమ్మెల్యే సతీష్‌కుమార్‌ను ఓదార్చుతున్న మంత్రులు విశ్వరూప్, వేణుగోపాలకృష్ణ

- అమలాపురానికి నాగేశ్వరరావు కుటుంబం మృతదేహాలు
- బోరున విలపించిన ఎమ్మెల్యే సతీష్ కుమార్
- ఓదార్చిన మంత్రులు విశ్వరూప్, వేణు

అమలాపురం టౌన్: అమెరికాలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన పొన్నాడ నాగేశ్వరరావు కుటుంబానికి చెందిన ఐదుగురి మృతదేహాలు మంగళవారం ఉదయం అమలాపురంలోని ముమ్మిడివరం ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్ కుమార్ ఇంటికి చేరుకున్నాయి. అమెరికాలోని టెక్సాస్‌లో గత నెల 26న జరిగిన రోడ్డు ప్రమాదంలో ఎమ్మెల్యే సతీష్ కుమార్ చిన్నాన్న, టింబర్ వ్యాపారి పొన్నాడ నాగేశ్వరరావు, ఆయన భార్య, కుమార్తె, ఇద్దరు మనవళ్లు మృతి చెందిన సంగతి తెలిసిందే. ఆ మృతదేహాలు ఇంటికి వచ్చినప్పుడు ఎమ్మెల్యే సతీష్ కుమార్ బోరున విలపించారు. చిన్నాన్నా... మమ్మల్ని అందరినీ విడిచి నీ కుటుంబాన్ని నీవెంట తీసుకుని వెళ్లిపోయావా అంటూ కన్నీటి పర్యంతమయ్యారు. అప్పటికే అక్కడికి చేరుకున్న రాష్ట్ర రవాణాశాఖ మంత్రి పినిపే విశ్వరూప్, రాష్ట్ర బీసీ సంక్షేమ, సమాచార, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ ఆయనను ఓదార్చారు.

ప్రముఖుల నివాళి

అమెరికా నుంచి విమానంలో సోమవారం రాత్రికి హైదరాబాద్ విమానాశ్రయానికి ఐదు మృతదేహాలను తీసుకువచ్చారు. అక్కడి నుంచి అంబులెన్సుల్లో అమలాపురం హౌసింగ్ బోర్డు కాలనీలోని ఎమ్మెల్యే సతీష్ కుమార్ ఇంటికి మంగళవారం ఉదయానికి చేరుకున్నాయి. రోడ్డు ప్రమాదంలో వీరితో పాటు మృతి చెందిన విశాఖపట్నానికి చెందిన అమెరికాలో ఉద్యోగం చేస్తున్న బత్రి రీసెల్ట్ మృతదేహం వచ్చింది. దానిని రావులపాలెం నుంచి విశాఖపట్నానికి తరలించారు. నాగేశ్వరరావు కుటుంబానికి చెందిన మృతదేహాలను ఎమ్మెల్యే సతీష్ కుమార్ ఇంటి ఆవరణలో రెండు గంటల పాటు ఉంచారు. ముమ్మిడివరం మాజీ ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి చెల్లుబోయిన శ్రీనివాసరావు, ముమ్మిడివరం, అమలాపురం నియోజకవర్గాలకు చెందిన ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, అభిమానులు, బంధువులు, సన్నిహితులు అధిక సంఖ్యలో తరలివచ్చి ఎమ్మెల్యే సతీష్ కుమార్‌ను ఓదార్చారు.

కోటిలింగాలరేవులో అంత్యక్రియలు

ఐదు మృతదేహాలను మూడు ప్రత్యేక వాహనాల్లో ఉంచి అమలాపురం నుంచి రాజమహేంద్రవరం వరకూ ఊరేగింపుగా అంతిమ యాత్ర నిర్వహించారు. ఈ యాత్రలో ఎమ్మెల్యే సతీష్‌కుమార్, మంత్రులు విశ్వరూప్, వేణుగోపాలకృష్ణ, ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, సన్నిహితులు పాల్గొన్నారు. అమలాపురం నుంచి ఊరేగింపుగా రాజమహేంద్రవరంలోని కోటిలింగాలరేవు వరకూ దాదాపు 70 కిలోమీటర్ల మేర అంతిమ యాత్ర సాగింది. అనంతరం రేవులో అంత్యక్రియలు నిర్వహించారు. నాగేశ్వరరావు మనవడి చేతుల మీదుగా ఈ కార్యక్రమం జరిగింది.

శాస్త్రీయ దృక్పథమే విజయానికి పునాది

అమలాపురం రూరల్: శాస్త్రీయ దృక్పథమే విద్యార్థుల విజయానికి పునాది అని కలెక్టర్ హిమాన్షు శుక్లా అన్నారు. రాష్ట్రస్థాయి విద్యా వైజ్ఞానిక ప్రదర్శనలో ఉత్తమ ప్రతిభను కనబరిచి దక్షిణ భారత విద్యా వైజ్ఞానిక ఎంపికైన నేదునూరు, వన్నె చింతలపూడి హైస్కూళ్లు, అమలాపురం ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థులను, అలాగే రాష్ట్ర స్థాయి కౌశల్ పోటీలలో ఉత్తమ ప్రతిభను కనబరిచి రాష్ట్రస్థాయి ప్రథమ స్థానాన్ని కైవసం చేసుకున్న దంగేరు జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులను, వారికి శిక్షణ ఇచ్చిన గైడ్ టీచర్లను, ప్రోత్సహించిన ప్రధాన ఉపాధ్యాయులను మంగళవారం తన చాంబర్‌కు పిలిచారు. జిల్లా విద్యాశాఖ అధికారి, జిల్లా సైన్స్ అధికారి సమక్షంలో వారిని ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎంపికైన విద్యార్థులకు ప్రత్యేక శిబిరాన్ని ఏర్పాటు చేసి, శిక్షణ ఇచ్చి జాతీయ స్థాయిలో రాణించేలా చర్యలు తీసుకోవాలని జిల్లా సైన్స్ అధికారి జీవీఎస్ సుబ్రహ్మణ్యాన్ని ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖాధికారి ఎం.కమల కుమారి పాల్గొన్నారు.

రూ.2.59 లక్షల ఎరువులు సీజ్

పి.గన్నవరం: రికార్డుల్లో వ్యత్యాసం కారణంగా పి.గన్నవరంలోని ఒక ఎరువుల షాపులో మంగళవారం రూ.2,59,700 విలువైన ఎరువులను విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్, వ్యవసాయ అధికారులు సీజ్ చేశారు. రాజమహేంద్రవరం ఇన్‌చార్జి రీజనల్ విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి ఎ.సురేష్ బాబు ఆధ్వర్యంలో విజిలెన్స్, వ్యవసాయ అధికారులు శ్రీనివాస జనరల్ ఏజెన్సీలో తనిఖీలు నిర్వహించారు. ఫ్యాక్ట్ 20.20 ఎరువులకు సంబంధించి స్టాక్ రికార్డులకు గ్రౌండ్ స్టాక్‌కు 10.6 మెట్రిక్ టన్నుల వ్యత్యాసం ఉంది. దీంతో ఆ ఎరువుల బస్తాలను సీజ్ చేశారు. షాపు యజమానిపై మండల వ్యవసాయ అధికారి కళ్యాణ్ కుమార్ 6 ఏ కేసు నమోదు చేశారు.

వివేకానంద పురస్కారాలకు నలుగురి ఎంపిక

అనపర్తి: స్వామి వివేకానందుని జయంతిని పురస్కరించుకుని వివిధ రంగాల్లో సమాజానికి విశిష్ట సేవలందిస్తున్న ప్రముఖులను ప్రతిష్ఠాత్మక స్వామి వివేకానంద జీవన సాఫల్య పురస్కారాలకు ఎంపిక చేసినట్లు రామకృష్ణ మిషన్ సభ్యుడు ఎం.దుర్గాప్రసాద్ తెలిపారు. దీనికి సంబంధించిన వివరాలను ఆయన మంగళవారం విలేకరులకు వెల్లడించారు. అనపర్తి శ్రీరామకృష్ణ సేవాసమితి ఆధ్వర్యంలో ఏటా అందించే స్వామి వివేకానంద జీవన సాఫల్య పురస్కారం-2024కు ప్రముఖ ఆధ్యాత్మిక ప్రవచనకర్త డాక్టర్ చాగంటి కోటేశ్వరరావు, రాజమహేంద్రవరానికి చెందిన ప్రముఖ వైద్య నిపుణుడు, సంఘ సేవకుడు డాక్టర్ గోలి వెంకట రామారావు, హైకోర్టు సీనియర్ న్యాయవాది నల్లమిల్లి శివారెడ్డి, స్వామి వివేకానంద ఎక్స్‌లెన్స్ అవార్డ్-2024కు స్వర్ణ భారత్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ యిమ్మణ్ణి దీపా వెంకట్‌ను ఎంపిక చేశామన్నారు. దుప్పలపూడిలోని ఆర్‌వీఆర్ కన్వెన్షన్‌లో ఈనెల 24న సమితి ఆధ్వర్యంలో జరిగే స్వామి వివేకానంద జయంతి వేడుకల్లో ఎమ్మెల్యే సత్తి సూర్యనారాయణరెడ్డి, రాజమహేంద్రవరం రామకృష్ణ మఠం అధ్యక్షుడు స్వామి పరిజ్ఞేయానందజీ మహరాజ్‌ల చేతుల మీదుగా పురస్కార గ్రహీతలకు ఒక్కొక్కరికి రూ.25 వేలు, జ్ఞాపిక, ప్రశంసాపత్రం అందజేసి సత్కరిస్తామన్నారు.


నల్లమిల్లి శివారెడ్డి; డాక్టర్ చాగంటి కోటేశ్వరరావు; డాక్టర్ గోలి రామారావు; యిమ్మణ్ణి దీపా వెంకట్

అంగన్వాడీ కార్యకర్తలు మరియు సహాయకులకు రాష్ట్ర ప్రభుత్వ విజ్ఞప్తి...

1. అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్లు 11 డిమాండ్లతో 12.12.2023 నుంచి నిరవధిక సమ్మె చేస్తున్నారు. మంత్రుల బృందం, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి మరియు ముఖ్య కార్యదర్శి మహిళా అభివృద్ధి మరియు శిశు సంక్షేమ శాఖ, ఆర్థిక శాఖ వివిధ స్థాయిలలో ప్రభుత్వం అనేక దఫాలుగా చర్చలు చేసిన తరువాత, ప్రభుత్వం కొన్ని డిమాండ్లను అంగీకరించింది. తదనుగుణంగా ప్రభుత్వం G.O లను జారీ చేసింది మరియు అందరికీ ప్రభుత్వం నిధులు విడుదల చేసింది. పెండింగ్‌లో ఉన్న అద్దెలు, కూరగాయల పోపు దినుసులు, అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణ ఖర్చులు మరియు నిర్వహణ ఛార్జీలు విడుదల చెయ్యడం జరిగింది.
a) అంగన్ వాడీ హెల్పర్‌ను అంగన్ వాడీ వర్కర్‌గా పదోన్నతి కల్పించేందుకు వయోపరిమితిని 45 ఏళ్ల నుంచి 50 ఏళ్లకు పెంచుతూ 20.12.2023 తేదీన జి.ఓ.ఎం.ఎస్.నెం.44 జారీ చేయబడింది.
b) అంగన్‌వాడీ కార్యకర్తలకు నెలకు ఒకసారి TA/DA మరియు అంగన్‌వాడీ హెల్పర్‌లకు త్రైమాసిక TA/DA క్లెయిమ్ చేయడానికి మెమో నం.2303564/ 2023/ PROG-I-A1, dt.20.12.2023 జారీ చేయబడింది. ఈ ఆదేశాలు జారీ చేసిన తేదీ నుండి అమలులోకి వస్తాయి.
c) అంగన్‌వాడీ వర్కర్లు & హెల్పర్‌ల కొనసాగింపుకు గరిష్ట వయోపరిమితిని 62 సంవత్సరాలుగా నిర్ణయించి, సేవా ముగింపు ప్రయోజనం రూ.1,00,000/- మరియు రూ.40,000 అందించడానికి జి.ఓ.ఎం.ఎస్.నెం. 47, తేదీ 20.12.2023 జారీ చేయబడింది.
d) అద్దెలు (Rs66.54 Crs), పరిపాలనా ఖర్చులు (నీరు & విద్యుత్ ఛార్జీలు, దీపుర్లు, ఫినాయిల్ మొదలైనవి) (Rs.7.81 Crs) మరియు AWCల నిర్వహణ (చిన్న మరమ్మతులు) (రూ.6.36 Crs) కోసం బడ్జెట్‌లు విడుదల చేయబడ్డాయి.
2. అంతేకాకుండా 2019 నుండి
a) అంగన్ వాడీ వర్కర్ల జీతాలను రూ.11,500/- లకు, మినీ అంగన్ వాడీ జీతాలను రూ.7,000/- కు, అంగన్‌వాడీ హెల్పర్ల జీతాలను రూ.7,000/- కు పెంచింది.
b) 2013 నుంచి అంగన్‌వాడీల కార్యకర్తలకు, సూపర్వైజర్లుగా ప్రమోషన్లు ఇవ్వలేదు. రాష్ట్ర విభజన తర్వాత తొలిసారిగా ప్రమోషన్లు ఇచ్చి 560 గ్రేడ్- 2 సూపర్ వైజర్ పోస్టులను భర్తీ చేయడం జరిగింది.
c) ఇదే సందర్భంలో ఈ సూపర్వైజర్ పోస్టులకు పరీక్షలు రాసేవారి వయోపరిమితిని 45 ఏళ్ల నుంచి 50 ఏళ్లకు పెంచుతూ వారికి అనుకూల నిర్ణయం తీసుకుంది. దీంతో 9 ఏళ్లుగా ప్రమోషన్ల కోసం ఎదురుచూస్తున్న వారిలో ఎక్కువ మంది పోటీపడే అవకాశాన్ని కల్పించడం జరిగింది.
d) అన్నిటికంటే ముఖ్యంగా ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ సంక్షేమ కార్యక్రమాలకు అంగన్ వాడీ కార్యకర్తలు, సహాయకులను అర్హులుగా గుర్తించి వారికి డీబీటీ ద్వారా రూ.1,313 కోట్లు అందించడం జరిగింది. నవరత్నాలు కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వం అమలు చేసిన జగనన్న విద్యా దీవెన, వైఎస్సార్ ఆసరా, వైఎస్సార్ రైతు భరోసా, జగనన్న వసతి దీవెన, వైఎస్సార్ ఆరోగ్య శ్రీ తదితర పథకాలను వారికి వర్తింప చేస్తోంది.
e) ఈ ఏడాది నుంచి అంగన్‌వాడీ వర్కర్లకు, హెల్పర్లకు జీవిత భీమాను కూడా వర్తింప చేస్తోంది. ప్రమాద బీమాగా రూ. 2 లక్షల వరకూ చెల్లించడం జరుగుతోంది.
f) గర్భవతులకు, బాలింతలకు, పిల్లలకు గతంలో మాదిరిగా వండి ఇచ్చే ఇబ్బంది లేకుండా టేక్ హోమ్ రేషన్ పద్ధతిని ప్రభుత్వం అమల్లోకి తెచ్చింది. దీనివల్ల వారికి పనిభారం తగ్గడమే కాకుండా పారదర్శకంగా, నాణ్యమైన సేవలు అందించే మార్గాలను అంగన్వాడీలకు అందిస్తూ 2023 నుంచి ప్రభుత్వం డ్రై రేషన్ అందిస్తోంది.
3. జాతీయ ఆహార భద్రతా చట్టం (NFSA), 2013 నిర్దేశించిన విధంగా ప్రతి గర్భిణీ స్త్రీలకు మరియు పాలిచ్చే తల్లికి బిడ్డ పుట్టిన 6 నెలల వరకు మరియు 7 నెలల నుండి 6 సంవత్సరాల వయస్సు గల ప్రతి బిడ్డకు (పౌష్టికాహార లోపంతో బాధపడే వారితో సహా) సప్లిమెంటరీ న్యూట్రిషన్ అందించడం తప్పనిసరి. వారు సంబంధిత అంగన్ వాడీ సెంటర్లో నమోదు చేసుకున్న లబ్ధిదారులకు అనుబంధ పోషకాహారం అన్ని పని వేళల్లో అందించాలి. ICDS పథకం కింద సప్లిమెంటరీ న్యూట్రిషన్, క్యాలెండర్ సంవత్సరంలో కనీసం 300 లేదా నెలలో సగటున 25 రోజులు అనగా, ఉదయం స్నాక్స్, వేడిగా వండిన భోజనం (HCM) మరియు టేక్ హోమ్ రేషన్‌గా అందించాలి.
4. సప్లిమెంటరీ న్యూట్రిషన్ ప్రోగ్రాం యొక్క లక్ష్యాలు గర్భిణీ స్త్రీలు మరియు పాలిచ్చే తల్లులు, 7 నెలల నుండి 3 సంవత్సరాల పిల్లలకు మరియు 3 సంవత్సరాల నుండి 6 సంవత్సరాల పిల్లలకు నిరంతరం పోషకాహార సహాయాన్ని అందజేయడం. AWW లు & AWHలు సమ్మె వలన వారి విధులకు హాజరు కాకపోవడం వలన, పోషకాహార కిట్‌లు, THR మరియు గుడ్లు & పాలు మరియు పంపిణీ చేయబడిన సప్లిమెంటరీ న్యూట్రిషన్ (SNP) లబ్ధిదారులకు లేదు. అంతేకాకుండా, గర్భిణీలు & పాలిచ్చే తల్లులు & 06 నెలలు - 6 సంవత్సరాల పిల్లలను ఆరోగ్య శాఖ ANM సమన్వయంతో అంగన్ వాడీ కేంద్రంలో వివిధ పెరుగుదల/ ఆరోగ్య పారామితులపై పర్యవేక్షణ జరగటం లేదు.
5. పైన పేర్కొన్న అంశాలదృష్ట్యా, అంగన్‌వాడీ కేంద్రాలలో అందించే సేవలకు ఆటంకం ఏర్పడినందున, గర్భిణులు & పాలిచ్చే స్త్రీలు, చిన్న పిల్లలు మరయు అణగారిన వర్గాల యొక్క ప్రయోజనాల దృష్ట్యా అంగన్ వాడీ కేంద్రాలలో అందించే సేవలను కొనసాగించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. మరియు ప్రజల ప్రయోజనాల దృష్ట్యా ప్రత్యామ్నాయ ఏర్పాట్లను చేయడం జరిగింది.
6. పిల్లలకు మరియు గర్భవతులు మరియు బాలింతలకు ఎలాంటి అంతరాయం లేకుండా పోషకాహారాన్ని అందించటానికి, అంగన్‌వాడీ సెంటర్లను నిర్వహించటానికి, ప్రత్యామ్నాయ ఏర్పాటు చేయడానికి, జీవిడబ్ల్యువి & వివిఎస్‌డబ్ల్యుఎస్ (లేదా) సెర్ప్ (లేదా) రెండింటి కలయికతో కూడిన గ్రామ సంస్థల యంత్రాంగాన్ని ఉపయోగించుకుంటున్నాము.
7. కాబినెట్ మంత్రుల గ్రూపు, చీఫ్ సెక్రటరీ, ముఖ్య కార్యదర్శి స్థాయి అధికారులు మీతో పలుదఫాలుగా చర్చించి, సమ్మెను విరమించుకోవలిసినదిగా విజ్ఞప్తి చేసియున్నారు. డిపార్ట్మెంటు కూడా అందరు అంగన్ వాడీ కార్యకర్తలకు బల్క్ ఎస్.ఎం.ఎస్‌ను పంపించి సమ్మెను విరమించుకోవలసినదిగా కోరటం జరిగింది. ప్రస్తుతం 53.7% గర్భవతులు రక్తహీనతతో వున్నారు, 29.6%, 5 సంవత్సరాలలోపు పిల్లలు బరువు తక్కువగా వున్నారు. 16.1% 5 సంవత్సరాలలోపు పిల్లలు ఎత్తుకు తగిన బరువు లేకుండా (ఎన్.ఎఫ్.హెచ్.ఎస్-5 ప్రకారంగా) వున్నారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పోషకాహార పంపిణీలో జరుగుతున్న అంతరాయం వలన వీరి ఆరోగ్య మరియు పోషణ స్థాయిలు దిగజారి హైరిస్క్ గ్రూప్ పడే ప్రమాదం వున్నది. మీరు సమ్మె నోటీసు ఇచ్చి ఉన్నారు. దీనిని పురస్కరించుకొని ప్రభుత్వం వారు మీ సంఘము యొక్క సభ్యులతో పలుసార్లు చర్చించి ముఖ్యమైన కోరికలకు ప్రాథమికముగా ఆమోదం తెలిపియున్నారు. ప్రభుత్వం మిగిలిన కోరికలను పరిష్కరించుటకు ప్రయత్నములు చేయుచున్నప్పటికీ, మీరు మీ యొక్క ఉద్యోగ బాధ్యతలను విస్మరించి విధులకు రావటం లేదు. కావున జిల్లా పరిపాలన అధికారిగా మీకు విజ్ఞప్తి చేయడం ఏమనగా మీ న్యాయమైన కోర్కెలన్నీ ప్రభుత్వం పరిష్కరించడానికి కృతనిశ్చయంతో ఉంది. ఇప్పటికే ప్రభుత్వం చాలా డిమాండ్లను పరిష్కరించిందని గుర్తుంచుకోవలసినదిగా అభ్యర్థిస్తున్నాము. అలాగే ఈ సమ్మె వల్ల బాలింతలు, గర్భిణీ స్త్రీలు, పసిపిల్లలు పౌష్టికాహారం అందక ఇబ్బందులను పడుతున్న విషయాన్ని సహృదయంతో అర్థం చేసుకోవలని మనవి చేస్తున్నాం. గర్భవతులు మరియు పిల్లల ఆరోగ్య మరియు పోషణ ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని సమ్మెను విరమించాలని విజ్ఞప్తి చేస్తున్నాము మరియు జనవరి 5, 2024 లోగా విధులకు హాజరు కావలసినదిగా కోరుచున్నాము. ఒకవేళ సమ్మె విరమింపచెయ్యని యెడల ప్రభుత్వ నియమ నిబంధనలు అనుసరించి శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని తెలియచేయటమైనది.

ఇట్లు
జిల్లా కలెక్టర్ మరియు మెజిస్ట్రేట్, డా॥ బి.ఆర్.అంబేడ్కర్ కోనసీమ జిల్లా

సాక్షి క్లాసిఫైడ్స్

Education

■ Single Sitting : 10th, 12th, BA, B.Com, B.Sc, MA, MCom, MSc, MBA, BBA, BCA BTECH, DIPLOMA, AGRICULTURE, PHARMACY, NURSING (for drop outs/ Backlogs) from UGC recognised Universities CALL : 73383 76874 [R-221]

■ One Sitting, 10th, Inter, Degree, B.Tech., (All Groups) Diploma, I.T.I., భీమవరం, కాంటాక్ట్ : 96669 63197, 96425 75794. [P-772864]

Real Estate

SITE FOR SALE
■ 200/320 Square Yards Villa Residential & Commercial Site for Sale at main road Behind Victory Bazar & Near Apartment Tallapudi Cont: 8309025067 [P-772949]

PLOT FOR SALE
■ కాకినాడ మధురానగర్ లక్ష్మీ గణపతి గుడి దగ్గర 330E నడకుదురు పెట్రోల్ బంక్ Opp. వీధిలో w205 చీడిగ గుడాల సత్రం 123N సంప్ర: 9848532848 [C-777274]

Services

BUSINESS OFFER



■ ఫీల్డ్ వర్క్ లేకుండా రియల్‌ఎస్టేట్‌లో వర్క్ చేస్తూ మంచి ఆదాయం సంపాదించుకునే అద్భుతమైన అవకాశం. అందరూ అర్హులే. అనుభవం లేని వారికి కూడా ట్రైనింగ్ ఇవ్వబడును. 9603729554 [G-8121]

KIMS HIRING — Purchase Manager: Qualification: MBA, Experience: 5 Years, Vacancies: 1; Staff Nurses: Qualification: GNM / BSC Nursing, Experience: 0 to 2 Years, Vacancies: 45; AYAS/Ward Boys: Qualification: SSC/Non Metric, Experience: 0 to 2 Years, Vacancies: 20; Security Guards: Qualification: SSC, Experience: 0 to 2 years, Vacancies: 10. Walk-ins Address: KIMS Hospitals, Seetam Nockarajau Complex Rd, Katari Gardens, Gandhipuram, RAJAMAHENDRAVARAM. For More Information Contact: +91 81792 56777

Wanted

■ హైదరాబాదులో మా ఇంట్లోనే ఉండి 4 సం॥ల పాప పనులు చేయుటకు 20 నుండి 45 సం॥లు గల స్త్రీ కావలెను. పెన్షన్ తీసుకునే వారు సంప్రదించవద్దు. ✆ : 86395 44676, 88865 50044 [R-211]

■ ప్రముఖ కంపెనీలో రాజమండ్రి, కాకినాడ, హైదరాబాద్, విశాఖపట్నంలో పనిచేయుటకు రిటైర్డ్ ఉద్యోగులు, నిరుద్యోగ యువతీ, యువకులు కావలెను. ✆ : 94940 42487, 98498 22088 [R-1171285]

■ హరేకృష్ణ హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్/నర్సులు కావలెను. ఫ్రీవసతి+భోజనం జీ.18K. ఫోన్: 9640258899/9640468899. [HA-1041]

ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకు
సాక్షి క్లాసిఫైడ్స్
నాలుగు లైన్లకు రూ. : 400/-
అదనపు లైనుకు రూ. : 90/-
GST 5% Extra
సర్వే నెం.264, ADB రోడ్, రాజానగరం.
ఫోన్: 0883-2483010

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

తాజా వార్తల కోసం లాగాన్ అవ్వండి www.sakshi.com